నమస్తే తెలంగాణ
నల్లగొండ
I | నల్లగొండ, సోమవారం 28 ఏప్రిల్ 2025 | NALGONDA

వరంగల్ ఎల్కతుర్తి సభా వేదికపై మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల

సూర్యాపేట బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గులాబీ జెండా ఎగురవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

హాలియా : తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించి, నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

నల్లగొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు

నార్కట్‌పల్లి : మండలంలోని అమ్మనబోలు గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

జెండా ఎత్తి.. దండు కట్టి

ఘనంగా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు — ఊరూవాడ గులాబీ జెండాల రెపరెపలు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్27(నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేతుల్లో జీవం పోసుకుని, 13 ఏండ్లల్లోనే గమ్యాన్ని ముద్దాడి, ప్రజలిచ్చిన అధికారంతో పదేండ్లు పాలన సాగించి, కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా షురూ అయ్యాయి. టీఆర్ఎస్‌గా పుట్టి బీఆర్ఎస్‌గా రూపాంతరం చెంది 24 ఏండ్లు పూర్తి చేసుకుని 25వ యేట అడుగుపెడుతున్న వేళ ఉమ్మడి నల్లగొండ జిల్లా అంతటా గులాబీ జెండాలు రెపరెపలాడాయి. పార్టీ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు ఊరూవాడ, పల్లెపట్నం తేడా లేకుండా క్షేత్రస్థాయి వరకు రజతోత్సవ వేడుకల సందర్భంగా పార్టీ శ్రేణులు జెండా పండగను ఘనంగా నిర్వహించాయి. అనంతరం రజతోత్సవ వేడుకుల ప్రారంభ సూచికంగా వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తితో నిర్వహించిన బ్రహ్మాండమైన కేసీఆర్ బహిరంగ సభకు పార్టీ యావత్తు తరలివెళ్లింది. పార్టీ నేతలు, కార్యకర్తలతో పాటు అభిమానులు, ఉద్యమకారులు, సామాన్య జనం, వివిధ వర్గాల ప్రజానీకం సైతం ఎల్కతుర్తికి దారి పట్టడంతో ఉమ్మడి జిల్లా మీదుగా ఏ దారి చూసినా గులాబీమయంగా మారింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మార్గదర్శనంలో మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా నుంచి అంచనాలకు మించి జనం ఎల్కతుర్తి సభకు తరలివెళ్లింది. మాజీ ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడే జెండాలు ఊపి వాహనాలను ప్రారంభించారు. ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటూచూసినా గులాబీ జెండాలు, ఆ జెండాలు, పోస్టర్లు అలంకరించిన వాహనాలే కనిపించాయి. హైదరాబాద్–వరంగల్ హైవేతో పాటు నకిరేకల్, అర్వపల్లి, తిరుమలగిరి, మొండ్రాయి మీదుగా వెళ్లే రహదారులపై వాహనాలు బారులు చీమలదండును తలపించాయి. ఇక సాయంత్రం సభావేదికపై నుంచి 'ప్రజల పక్షాన ఇక నేను బయల్దేరుతా... ఎందాకైనా సరే... మళ్లా గులాబీ జెండానే ఎగురతది' అంటూ సాగిన అధినేత కేసీఆర్ ప్రసంగం గులాబీ సైన్యంలో నూతనోత్తేజాన్ని, సమరోత్సాహాన్ని నింపింది.

జెండా ఎగురవేసి ఓరుగల్లుకు పయనం

- సభకు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యేలు
- ప్రతి గ్రామం నుంచి కదం తొక్కిన గులాబీ సైన్యం
- ఎల్కతుర్తి దారులన్నీ గులాబీమయం
- అంచనాలకు మించి తరలివెళ్లిన జిల్లా జనం
- ఓరుగల్లు సభతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- ప్రజల పక్షాన నేను బయల్దేరుతా.. మళ్లా ఎగిరేది గులాబీ జెండానే : కేసీఆర్

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి అంచనాలకు మించి గులాబీ సైన్యం వరంగల్‌కు తరలివెళ్లింది. పార్టీ రజతోత్సవ వేడుకల సన్నాహకాలు ఈ నెల మొదటి వారం నుంచే మొదలై వరంగల్ సభకు విస్తృత ప్రచారం కల్పించారు. పార్టీ అధినేత కేసీఆర్‌తో భేటీ అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మార్గదర్శనంలో ఉమ్మడి జిల్లా కీలక నేతలంతా రజతోత్సవ వేడుకలకు దృష్టి సారించారు. గ్రామగ్రామాన ప్రతి గులాబీ సైనికుడు భాగస్వామ్యం అయ్యేలా కార్యాచరణ రూపొందించి ముందుకు సాగారు. దీంతో సామాన్య జనం సైతం బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవంపై దృష్టి సారించక తప్పలేదు. వాస్తవంగా రాష్ట్రాన్ని సాధించి, పదేండ్లల్లో అద్భుతంగా దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను కాదనుకుని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి ఓట్లు చేసి గెలిపించి ఇప్పుడు పశ్చాత్తాపడుతున్న సందర్భంలో జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు అన్ని వర్గాల ప్రజల్లోనూ ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఎక్కడ చూసినా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకల పట్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పార్టీ శ్రేణులు సైతం ఉత్సాహంతో కదిలి కదం తొక్కారు. ఆదివారం పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, పట్టణాల్లోని ప్రతి వార్డులోనూ గులాబీ జెండాలను ఎగురవేసి జెండా పండగ ఘనంగా నిర్వహించారు. శుక్ర, శనివారాల్లోనే పార్టీ జెండా దిమ్మెలను ప్రత్యేకంగా కలర్స్ వేసి, తోరణాలు కట్టి అలంకరించారు. ఆదివారం ఉదయం జెండా ఎగురవేసి అనంతరం ఎల్కతుర్తి సభకు బయల్దేరారు. దాదాపు ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్లారు. మారుమూల తండాల్లో నుంచి సైతం వాహనాలు ఓరుగల్లు దారి పట్టాయి. చిన్న, పెద్ద వాహనాలన్నీ కలిపి 5వేలకు పైగా ఎల్కతుర్తికి పయనమైనట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

అంచనాలకు మించి...

ఉమ్మడి జిల్లా నుంచి అంచనాలకు మించి జనం ఎల్కతుర్తి సభకు తరలివెళ్లారు. వాస్తవంగా 80వేల మంది వస్తారని ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోగా ప్రజల నుంచి వచ్చిన స్పందనతో అది లక్ష మంది వరకు పెంచాల్సి వచ్చింది. గత రెండుమూడు రోజులుగా క్షేత్రస్థాయి నుంచి సామాన్యులు సైతం తాము వస్తామంటూ పార్టీ నేతలపై ఒత్తిడి తేవడంతో కనిపించిన ప్రతి వాహనాన్ని సభ కోసం బుక్ చేయాల్సి వచ్చింది. దీంతో ఆదివారం ఉమ్మడి జిల్లా నుంచి లక్ష మందికి పైగా పార్టీ నేతలు, శ్రేణులు, సామాన్య జనం సైతం ఎల్కతుర్తిలో కదం తొక్కినట్లు పార్టీ నేతలు ప్రకటించారు. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు బస్సులు, స్కూలు బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్, డీసీఎంలు, టెంపోటాక్సీలు, పార్టీ నేతల సొంత వాహనాలు... ఇలా అందుబాటులో ఉన్న ప్రతి వాహనంలో జనం ఎల్కతుర్తి బాట పట్టారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లోని మండలాల వారీగా నేతలు పోటీ పడి జనం తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి వాహనంపైనా నియోజకవర్గం, మండలం, ఊరి పేర్లతో గులాబీ స్టిక్కర్లు అంటించి, జెండాలతో అలంకరించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ప్రతి రహదారి ఆదివారం గులాబీ జెండాలున్న వాహనాలతో కనువిందు చేసింది. ఇక మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తదితరులంతా మధ్యాహ్నం వరకే సభా వేదికపైకి చేరుకున్నారు. కాగా కేసీఆర్ సభా వేదికపైకి చేరుకోవడానికి చాలా ముందే ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, ఇతర కీలక నేతలంతా వేదికపైన ఆసీనులయ్యారు.

భువనగిరిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని ఫోన్‌లో ఆసక్తిగా వింటున్న వృద్ధుడు

నల్లగొండ నుంచి బస్సులో ఎల్కతుర్తికి బయల్దేరిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

జెండా ఊపి ప్రారంభం...

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బయల్దేరిన వాహనాలను పార్టీ ముఖ్య నేతలతో మాజీ ఎమ్మెల్యేలు జెండా ఊపి ప్రారంభించారు. నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ జెండాను ఎగురవేశారు. అనంతరం జెండాలు ఊపి సభకు వెళ్లే వాహనాలను ప్రారంభించారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పార్టీ జెండాను ఎగురవేసి వామనాలకు పచ్చ జెండా ఊపి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నకిరేకల్‌లోని పార్టీ ఆఫీసులో, నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలులో పార్టీ ఆవిర్భావం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పార్టీ జెండాను ఎగురవేశారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పార్టీ జెండా ఎగురవేసి వాహనాలను ప్రారంభించారు. హాలియాలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌లో పార్టీ జెండా ఎగురవేసి రజతోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సభకు వెళ్లే వాహనాలకు జెండా ఊపారు. చౌటుప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేసి వాహనాలకు జెండా ఊపి ఎల్కతుర్తికి బయల్దేరారు. సూర్యాపేటలో పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పార్టీ జెండాను ఎగురవేసి వాహనాలను ప్రారంభించారు. ఆలేరులో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేసి సభకు వెళ్లే వాహనాలకు శ్రీకారం చుట్టారు. ఇక సభకు వెళ్లే ప్రతి వాహనంలో భోజనం, మంచినీరు, వేసవి నేపథ్యంలో మజ్జిగ తదితర సామగ్రిని సమకూర్చుకుని వెళ్లారు. మార్గమధ్యలోనే మధ్యాహ్న భోజనాలు పూర్తి చేసుకుని సాయంత్రం 3 గంటలలోపే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. రాత్రి 8గంటలకు అధినేత కేసీఆర్ ప్రసంగం ముగిశాక తిరుగుపయనమయ్యారు.

మిర్యాలగూడ : బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

చౌటుప్పల్‌లో వరంగల్ వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: వంగపల్లిలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

వరంగల్ వెళ్తూ నేరేడుచర్ల పట్టణంలో కోలాట ప్రదర్శన

ఆత్మకూరు(ఎం) : బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు

హాలియా నుంచి వరంగల్ సభకు బయల్దేరిన వాహనాలు

అకాల వర్షంతో తడిసిన వరిధాన్యం

భూదాన్‌పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెంలో వర్షానికి తడిసిన ధాన్యం చూపిస్తున్న

చౌటుప్పల్/ భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 27 : జిల్లాలో పలు చోట్ల ఆదివారం అకాల వర్షంతో ధాన్యం తడిసింది. సుమారు గంటపాటు ఉరుములు, మెరుపులతో వాన పడడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వరదకు కొట్టుకుపోయింది. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌తోపాటు భూదాన్ పోచంపల్లి మండలంలోని శివారెడ్డిగూడెంలో ధాన్యం తడవడంతో అన్నదాతలు అవస్థలు పడ్డారు. ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం తడిసిందని, ధాన్యం తెచ్చి పదిరోజులైనా కొనుగోలు చేయడం లేదని రైతులు మండిపడుతున్నారు. వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చౌటుప్పల్ మార్కెట్ యార్డ్‌లో తడిసిన వరి ధాన్యం

జాన్‌పహాడ్‌లో అక్రమంగా మట్టి తరలింపు

పట్టించుకోని అధికారులు

పాలకవీడు, ఏప్రిల్ 27 : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామ రెవెన్యూ శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. గ్రామంలోని 319 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో పెద్ద సంఖ్యలో జేసీబీలను ఉపయోగించి పదుల సంఖ్యలో టిప్పర్ల సహాయంతో అక్రమార్కులు మట్టి ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీని వల్ల ప్రభుత్వ భూములు ధ్వంసమవుతున్నాయని, భారీ టిప్పర్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా నిర్భయంగా పట్టపగలే మట్టిని కొల్లగొట్టి విధ్వంసం సృష్టిస్తున్నా రెవెన్యూ అధికారులుగానీ, పోలీసు అధికారులుగానీ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మట్టి తరలింపులో అధికార పార్టీ నాయకుల హస్తం ఉండడంతోనే అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మట్టి తరలింపుపై పలువురు విలేకరులు ఇన్‌చార్జి తాసీల్దార్ కమలాకర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం గమనార్హం. దీనిపై హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులును ఫోన్‌లో వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

జాన్‌పహాడ్ గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు